క్లుప్తంగా

ఎట్టకేలకు ట్యాప్ ఏర్పాటు



వాటర్ ట్యాంక్‌కు అమర్చిన ట్యాప్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కులో వాకర్స్ దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌కు ఎట్టకేలకు ట్యాప్ ఏర్పాటు చేశారు.గతంలో ఇక్కడ ట్యాంకు పెట్టినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో అలంకార ప్రాయంగా ఉంది. దీనిపై వాకర్స్ ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు బుధవారం ట్యాప్‌ను అమర్చారు. దీంతో వాకర్స్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందిస్తున్న మహిళా సేవా మండలి సభ్యులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లోని మహిళాసేవా మండలి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిరుపేద కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం మహిళా సేవా మండలి సభ్యులు అందజేశారు. మండలి చేపడుతున్న సహాయ కార్యక్రమాలు అభినందనీయమని పలువురు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.

శ్రమిస్తే మరిన్ని లాభాలు

- భెల్ చైర్మన్ సదాశివమూర్తి



భెల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న కార్మిక నాయకులు

గాజువాక: భెల్ చైర్మన్ సదాశివమూర్తి భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌ను బుధవారం సందర్శించారు. యూనిట్‌కు తొలిసారిగా విచ్చేసిన ఆయనకు అధికారులతోపాటు కార్మిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కర్మాగారంలో పలు విభాగాలను ఆయన సందర్శించారు. అనంతరం కార్మిక నాయకులు, అధికారులతో మాట్లాడుతూ ఉద్యోగులు శ్రమించి కర్మాగారానికి లాభాలు తీసుకొస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మంచి వర్క్ ఆర్డర్‌లు లభిస్తాయన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేసి మరింత లాభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భెల్ హెచ్‌పీవీపీ ఈడీ సుబ్రమణ్యం, అధికారులు గౌరీ శంకర్, ఎస్.లీలా, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు ఎస్.సాహు, బి.బాబూరావు, కొల్లి దేవుడు, పీవీఎస్ రాజు, పి.వీరబాబు, కంచిపాటి ప్రకాష్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

18 నుంచి స్టీల్‌క్లబ్ వార్షికోత్సవాలు




సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కునగరం: ఉక్కు కనిష్ట అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) వార్షికోత్సవ వేడుకలు ఈనెల 18 నుచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు ఎం. మధుసూదనరావు తెలిపారు. స్టీల్‌క్లబ్ 22వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న శుక్రవారం మెగా బంపర్ హౌసీ ఏర్పాటు చేశామన్నారు. 19న సాంస్కృతికోత్సవంలో భాగంగా మెగా మ్యూజికల్ అండ్ డ్యాన్స్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఇండియన్ ఐడల్ గాయకులు హర్షవర్ధన్, ప్రసన్న, జయంత్ మాథుర్ తదితర గాయకులు పాల్గొంటారని.. అంతర్జాతీయ గాయకులు సుప్రీం శేఖర్ తమ గానంతో అలరించనున్నారన్నారు. 20న అంతర్జాతీయ నృత్యకళాకారిణి గుణశ్రీ ప్రత్యేక నృత్యాలు ఉంటాయని తెలిపారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ సభ్యుల ఆహ్లాదం కోసం నిర్వహిస్తున్న వేడుకలకు క్లబ్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

వీధిలైట్ల నిర్వహణ పట్టదా?

• కొన్ని ప్రాంతాల్లో పగటి వెలుగులు • అంధకారంలో మరికొన్ని ప్రాంతాలు



సింథియా సమీపంలో పట్టపగలే వెలుగు



63వ వార్డులో చీకట్లో ప్రయాణిస్తున్న ప్రజలు



63వ వార్డులో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం

సింథియా: జీవీఎంసీ అధికారుల పనితీరు ప్రజలకు కొత్త సమస్యలు తెచ్చిపెడుతోంది. విద్యుత్ దీపాల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇందుకు మల్కాపురం, క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ, త్రినాథపురం, దుర్గానగర్ వంటి ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణే నిదర్శనం. చీకటి పడితే ఈ ప్రాంతాల్లో ప్రయాణమంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. చీకట్లో ప్రయాణించడంతో అనేక రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. మరో వైపు చీకట్లో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మహిళలతో పాటు ఒంటరిగా వెళ్లే వారిపై మత్తులో ఉన్న వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు.

నానా అవస్థలు

ఒక వైపు రాత్రిళ్లు వీధి లైట్లు వెలగక వాహన చోదకులు తంటాలు పడుతుంటే, మరో వైపు పట్టపగలే దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారుల వాటిపై దృష్టి సారించడంలేదు. ఈ సమస్యలపై జీవీఎంసీ, విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలంలో మరిన్ని అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గోతుల్లో నీరు చేరడంతో గుర్తించ లేక గోతుల్లో పడి గాయాల పాలవుతున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీధిలైట్ల కోసం పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిపక్షాల మీద కుట్రపూరిత కేసులు పెట్టి రాక్షసానందం పొందుతున్నారే తప్పా, ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన అసలే లేదని ప్రజలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు వేయడంతో పాటు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మితిమీరుతున్న ఆకతాయిల ఆగడాలు



మల్కాపురం నుంచి సింథియా రోడ్డులో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. మద్యం తాగి ఖాళీ సీసాలతో విద్యుత్ దీపాలను పగలుగొడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. అధికారులు స్పందించి వీధిలైట్ల సమస్యను పరిష్కరించి, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయాలి.

– దాసరి రవి, మల్కాపురం

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



కొన్ని రోజులుగా రాత్రిళ్లు వీధి లైట్లు వెలగక నానా ఇబ్బందులు పడుతున్నాం. సమస్యపై విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– నక్కా సూర్యనారాయణ, దుర్గానగర్

రాత్రిళ్లు అవస్థలు



సింథియా ప్రధాన రహదారిలో సాయంత్రం 6 గంటలు దాటితే ప్రయాణించలేకపోతున్నాం. ఈ ప్రాంతంలో వీధిలైట్లు వెలగక చీకటిలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఈ రోడ్డులో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించుతున్నాయి. వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు పోలీసులు ఆకతాయిలను నిలువరించే చర్యలు తీసుకోవాలి.

– కొట్నాన రవి, చింతల్లోవ

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ త్రినాథపురం,11 కేవీ మల్కాపురం ఫీడర్లలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్ –2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మల్కాపురం ఫీడర్‌లోని రెడ్డివీధి,మరిడిమాంబ టెంపుల్ ఏరియా,గొల్లవీధి,పల్లివీధి,రజిక కాలనీ,త్రినాథపురం,గాంధీజీవీధి,జాలరువీధి ప్రాంతాలతో పాటు మల్కాపురం మార్కెట్ వీధి, హరిజన వీధి,శెట్టిబలిజ వీధి,ప్రకాష్‌నగర్, మల్కాపురం మెయిన్‌రోడ్డు ఏరియా,నగరాలవీధి,వెంకన్నపాలెం,ఏడు గుడుల సెంటర్ ఏరియా,బాపూజీకాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

శ్రీహరిపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా జీవీఎంసీ 58,60వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. గుల్లలపాలెం మార్కెట్ ఏరియా,పాత్రుడు కాలనీ(కోరమాండల్ గేటు),శ్రీహరిపురం మెయిన్‌రోడ్డు ఏరియా,వీటి కాలనీ రోడ్డు ఏరియా,పాత రామాలయం వీధి ఏరియా,జవహర్‌నగర్ ఏరియా,బర్మాకాలనీ ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పైలట్ వాటర్ ప్రాజెక్ట్ ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో ఏర్పాటు చేసిన పైలట్ వాటర్ ట్యాంక్‌ను బుధవారం పుర్రెసురేష్ యాదవ్ ప్రారంభించారు. కాలనీ వాసులు అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూటమి నేతల అభాసుపాలు..!

- రిక్షా కాలనీలో బోర్‌వెల్ పనులకు లైన్ క్లియర్
- ప్రజాగ్రహంతో రంగంలోకి అధికారులు
- మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్‌తో చర్చలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గౌరీ నగర్(రిక్షా కాలనీ)లో బోర్ వెల్ నిర్మాణ పనులకు అడ్డుపడ్డ కూటమి నేతల తీరుపై ప్రజాగ్రహం పెల్లుబికింది. బడుగు జీవులకు తాగునీటిని అందించే విషయంలోనూ కుటిల రాజకీయాలు చేయడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. బోర్ వెల్ నిర్మాణం కోసం రిక్షా కాలనీ వాసులు ఖాళీ బిందెలతో రోజంతా ఆందోళన చేయడం, వారికి మద్దతుగా మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాలనీలోని నడిరోడ్డుపైరాత్రి వేళ నిద్రకు ఉపక్రమించి నిరసనకు దిగడంతో అధికారుల్లోనూ తీవ్ర చర్చసాగింది. వార్డు పరిధిలో నాయకుడు చెప్పాడని పేదల కాలనీలో తాగునీరు లేకుండా చేయటం సరైంది కాదని కూటమిలోని పార్టీ నాయకుల మధ్య చర్చకు దారితీసింది. మరింత అభాసుపాలవుతామని గ్రహించిన కూటమి పెద్దలు రంగంలోకి దిగడంతోనే అధికారులు జోక్యం చేసుకున్నట్టు తెలుస్తోంది.

వాటర్ వర్క్స్ అధికారుల చర్చలు

రిక్షా కాలనీలో చోటుచేసుకున్న పరిణామాలతో పోలీసులు సైతం రంగంలోకి దిగారు. కాలనీలో రాత్రి వేళ నిరసన కొనసాగించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వాటర్ వర్క్స్ అధికారులకు ఎయిర్‌పోర్టు పోలీసులు సూచించారు. దీంతో జీవీఎంసీ వాటర్ వర్క్స్ డీఈ శ్రీనివాస్ రావు, ఏఈ సుమన్ మంగళవారం రాత్రి రిక్షా కాలనీని సందర్శించారు. బోర్ వెల్ నిర్మాణాలు నిలిపివేయడంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని తెలిపారు. గ్రౌండ్ వాటర్ ఏ మేరకు ఉందోనని జియాలజిస్టుతో సర్వే చేయించాలని పనులు ఆపినట్టు చెప్పారు. గ్రౌండ్ వాటర్ సర్వే పూర్తయిన వెంటనే బోర్ వెల్ నిర్మాణాలు చేపడతామన్నారు. దీంతో రిక్షా కాలనీ వాసులు ఆందోళన విరమించారు.

తూతూ మంత్రంగా తొలగింపులు!



ఘాట్ పాయింట్ తోపుడు బండిని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది



గుడిపక్కనే ఉన్న కొబ్బరి కాయల దుకాణాన్ని తొలగిస్తున్న దృశ్యం



రోడ్డుపైకి ఉన్న టీడీపీ ఫ్లెక్సీని, ఆ వెనుక ఉన్న షెడ్డు జోలికి వెళ్లని అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రధాన రహదారిలో ఆక్రమణలను బుధవారం తొలగించే ప్రక్రియను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు. అయితే వీరి చర్యలు విమర్శలకు దారి తీశాయి. కూటమికి చెందిన వారి ఆక్రమణల జోలికి వెళ్లకుండా చిరు వ్యాపారాలు చేసుకునే దుకాణాలు, బ్యానర్లను తొలగించేశారు. కొత్తపాలెం రైల్వే మదాల జంక్షన్ నుంచి భగత్‌సింగ్ నగర్ వరకు పలు ఆక్రమణలు ఉన్నాయి. చాలా చోట్ల రహదారితో పాటు కాల్వలను సైతం ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేశారు. ఆ నిర్మాణాల జోలికి వెళ్లకుండా షో చేసి ముగించేశారని వాపోతున్నారు.

కూటమి నాయకుల ఒత్తిళ్లే కారణం

కూటమి నాయకుల ఒత్తిళ్ల వల్లే టౌన్ ప్లానింగ్ అధికారులు తూతూ మంత్రంగా తొలగించారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మాత్రం దానికి ఇద్దరు ఎస్‌ఐలతో సహా సిబ్బందిని బందోబస్తు పెట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

వైన్సే కారణం...

కొత్తపాలెంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలకు జంక్షన్‌లో ఉన్న వైన్‌షాపే కారణమని పలువురు చెబుతున్నారు. ఇక్కడ తొలగించి ఊరికి శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని స్థానికులు చెబుతున్నారు. దుకాణానికి వంద అడుగుల దూరంలో దేవాలయం ఉందని ..అయినా దీనికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ దుకాణం కూటమి నాయకులది కావడంతో అధికారులు దానికి జోలికి వెళ్లడం లేదని మండిపడుతున్నారు.

స్మార్టు మీటర్లు వద్దని ఆందోళన



మల్కాపురం సబ్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్టు మీటర్ల ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ నాయకులు మల్కాపురంలోని విద్యుత్ ఉప కార్యాలయం వ్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కాంద్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి నాయకులు ఆదాయం పెంచుకోవాలనే ఆలోచనతో పేద ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే పైసా కూడా విద్యుత్ చార్జీ పెంచబోమని వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు నేడు పెరిగిన విద్యుత్ చార్జీలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయినా అభివృద్ధి కంటే ప్రజలపై భారాలే అధికంగా ఉన్నాయని వివరించారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతం అవుతుంటే ఇప్పుడు స్మార్టు మీటర్లు ఏర్పాటు చేసి వారికి మరింత ఆర్థిక ఇబ్బందులు కలిగించేందుకు కూటమి సర్కారు యత్నిస్తుందని మండిపడ్డారు. రానున్న రోజులల్లో వారిని రోడ్డుపై నిలబెట్టే కాలం వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ రైలుకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ అధికారులకు లేఖ రాశారు. అలా చేస్తే బోగీలు ప్రయాణికులు లేకుండా ఖాళీగా నడపాల్సిన అవసరం ఉండబోదని పేర్కొన్నారు. విశాఖలో తెల్లవారు జామున బయల్దేరే వందే భారత్‌ను అందుకోవాలంటే గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని వివరించారు.

హామీల అమల్లో చంద్రబాబు మోసం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- పద్మనాభనగర్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం

గోపాలపట్నం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ విమర్శించారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రగ్రంథాలుగా భావించి అమలు చేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో బాబు చెప్పినవన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. మొదట ఏడాది అన్ని హామీలు ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. తల్లికి వందనం ప్రతి పిల్లాడికి వేస్తామని చెప్పి.. కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చాయని.. కార్లు ఉన్నాయని, ఇళ్లలు ఉన్నాయంటూ కుంటి సాకులతో ఇవ్వకుండా దాట వేశారన్నారు. గతంలో అర్హులుగా ఉన్నవారిలో చాలా మందిని అనర్హులుగా మార్చేశారని అన్నారు. ఉచిత బస్సులో కడప నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రయాణించవచ్చునని చెప్పిన బాబు ఇప్పుడు మాటమారుస్తున్నారని ధ్వజమెత్తారు. గోపాలపట్నం నుంచి అనకాపల్లి వెళ్తే టికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మోసం చేయడంలో చంద్రబాబుకే ఆయనే సాటని అన్నారు. కూటమి నాయకులను హామీలు ఎక్కడ అమలు చేశారంటూ అడగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, నాయకులు కంపర రామకృష్ణ, సాలాపు మారయ్య, లోకేష్ రెడ్డి, కొండాపు సత్తిబాబు, యర్రా గంగరాజు, విజయ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో మేధస్సు వృద్ధి

మల్కాపురం: సృజనాత్మకంగా ఆలోచించడం వల్ల మానవ మేధస్సు వికసిస్తుందని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్–3 ప్రొగ్రాం అధికారి వి.అంజలీదేవి అన్నారు. కళాశాలలో నూతనంగా డిగ్రీలో ప్రవేశించిన విద్యార్థులకు మూడు రోజుల పాటు ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబి రాలు నిర్వహిస్తున్నారు.తొలి రోజు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విషయాన్ని భిన్నంగా ఆలోచించడం,విశ్లేషించడం ఉన్నత విద్యలో భాగమని అన్నారు.సృజనాత్మక ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల రసాయ న శాస్త్ర అధ్యాపకురాలు నవిత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు కొర్రీలు పెట్టే స్కూళ్లపై ఫోకస్



తల్లిదండ్రులతో సమావేశమైన డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

విశాఖ విద్య: ఉచిత విద్య అమలుకు కొర్రీలు పెడుతున్న ప్రైవేటు స్కూళ్లపై ఎట్టకేలకు విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. ఎన్ఏడీ భాష్యం స్కూల్ నిర్వాహకులు ఉచిత విద్య ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి పుస్తకాలు, యూనీఫారం పేరిట డబ్బులు వసూలు చేయడంతో తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టారు. ఇదే క్రమంలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో విద్యాశాఖాధికారులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో ప్రేమ్‌కుమార్ సూచనల మేరకు డిప్యూటీ డీఈవో ఎ. సోమేశ్వరరావు బుధవారం ఎన్ఏడీ భాష్యం స్కూల్‌లో విచారణ చేపట్టారు. తాము కట్టిన ఫీజు డబ్బులు తిరిగి ఇప్పించాలని తల్లిదండ్రులు కోరారు. కాగా విచారణ పూర్తయినట్టు సంతకాలు చేయాలని సూచించగా, ఇందుకు తల్లిదండ్రులు సమ్మతించలేదు. అందరితో చర్చించిన తర్వాతే తాము సంతకాలు చేస్తామని చెప్పడంతో పాఠశాల నిర్వాహకులు సైతం కంగుతిన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గాజువాక: ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని గాజువాక అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కోర్టు కేసులను పరిష్కరించుకోవడంపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీసీ సెక్షన్ 89 ప్రకారం కోర్టులో దాఖలు చేసిన అన్ని కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపాల్సి ఉంటుందన్నారు. కోర్టు కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల వివిధ లాభాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి, కార్యదర్శి డి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విమల విద్యాలయంపై టీడీపీ నమ్మక ద్రోహం

కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)ను తెరిచే అంశంలో టీడీపీ నమ్మక ద్రోహానికి పాల్పడుతుందని కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు ఆరోపించారు. విమల విద్యాలయాన్ని ప్రారంభించాలన్న డిమాండ్‌తో గంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్కూల్ ఎదుట బుధవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా స్కూలు ప్రారంభించకుండా ఉక్కు యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. డీఈవోకు అనుమతి లెటర్ ఇవ్వకుండా స్కూల్‌ను మూసివేయాలని కుట్ర చేస్తుందని మండిపడ్డారు. 1600 మంది పేద, కార్మిక బిడ్డలు చదువులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.